## క్లుప్తంగా

### వేతనాలు విడుదల చేయాలని వేడుకోలు

**శాంతిపురం:** మధ్యాహ్న భోజన కార్మికులకు పది నెలలుగా గౌరవ వేతనాన్ని ఇవ్వలేదని , వెంటనే విడుదల చేయాలని కోరుతూ కార్మికులు వేడుకొన్నారు. శుక్రవారం వారు ఎంఈవో చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు చైతన్య మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులను సత్వరం విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో ఎన్నికలు, అధికార మార్పు జరిగి ఆరు నెలలు గడిచినా బిల్లులు విడుదల కాలేదన్నారు. సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చినా భోజన కార్మికులపై రాజకీయ కక్ష సాధింపు కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తుమ్మిశిలో నలుగురు కార్మికులను తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. వారిని మళ్లీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండు చేశారు.

### అక్కదేవతల ప్రతిష్ఠ

**పుంగనూరు:** పట్టణ సమీపంలోని యాబైరాళ్ల మొరవ వద్ద అక్కమ్మ దేవతల ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో ప్రతిష్ఠించిన అక్కదేవతలకు పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

### శ్రీవారి భక్తుల సేవే లక్ష్యం

**పలమనేరు:** దాతల సాయంతో టీటీడీ నిత్యాన్నదానానికి సేవ చేయడమే తమలక్ష్యమని పట్టణానికి చెందిన కూరగాయలు వితరణ చేస్తున్న శ్రీవారి సేవకులు రవీంద్ర, కిశోర్‌స్వామి తెలిపారు. ఆ మేరకు తిరుమల ఆలయంలో నిత్యాన్నదానానికి పలమనేరు ప్రాంతం నుంచి కూరగాయలను వితరణ చేస్తున్న రైతులు, మండీ వ్యాపారులు, వీరికి సాయం చేస్తున్న వారిని పట్టణంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 14 ఏళ్లుగా దాతల సాయంతో వెంగమాంబ నిత్యాన్నదాన పథకానికి 360 లోడ్ల వివిధ రకాల కూరగాయలను వితరణ చేశామన్నారు. దీనిపై కొందరు సోషల్ మీడియాలో విమర్శలు చేయడం తగదన్నారు. బాలాజి, సోమన్న,ఆకుల గజేంద్ర, సిద్దయ్య, గిరి పాల్గొన్నారు.

### మా భూములను ఆ జాబితా నుంచి తొలగించండి



అధికారులకు అర్జీలిచ్చి మొరపెట్టుకుంటున్న అంధుడు ఆదెప్ప

**చౌడేపల్లె:** కష్టపడి మా పూర్వీకులు సంపాదించిన సెటిల్‌మెంట్ భూములను రెవెన్యూ అధికారుల తప్పిదం కారణంగా గెవిమఠం ఆలయ మాన్యం భూముల జాబితాలోకి చేర్చడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు డిప్యూటీ తహసీల్దార్ మాధవి దృష్టికి తెచ్చారు. మండలంలోని ఏ.కొత్తకోట రైతు సమాచార కేంద్రం ఆవరణలో శుక్రవారం రెవెన్యూ సదస్సును ఒక గంట ఆలస్యంగా ప్రారంభించారు. అంకుతోటపల్లెకు చెందిన 21 మంది రైతులకు చెందిన 200 ఎకరాల భూములు ఆలయ మాన్యం జాబితాలోకి చేర్చడంతో ఇబ్బందులు పడుతున్నామని, వాటిని ఆ జాబితా నుంచి తొలగించాలని నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి అధికారులను వేడుకున్నారు. 13 ఏళ్లుగా పోరాడుతున్నా పట్టించుకునేవారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ అగ్రహారానికి చెందిన అంధుడు ఆదెప్ప, అతని భార్య రోజమ్మ సహకారంతో రెవెన్యూ సదస్సుకు వచ్చి బోరున విలపించారు. డీటీ మాట్లాడుతూ రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్ఐ భారతి, సర్వేయర్ గుణశేఖర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

# క్యాబేజీ ధరహాసం

మూడేళ్లుగా క్యాబేజీ సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర లేక కనీసం పంట పెట్టుబడులు దక్కక నష్టాల బాటపట్టారు. కానీ ఇదే పంటలో లాభాలు గడించాలని మొండిగా మళ్లీ సాగు చేసిన రైతులు ఇప్పుడు లాభాలు ఆర్జిస్తున్నారు. ధరలు ఆశాజనకంగా ఉండడంతో పొరుగు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు తోటల వద్దకే వచ్చి సరుకును కొంటున్నారు. సాధారణంగా విజయ దశమి వరకు ధరలు ఎక్కువగా ఉండి ఆపై తగ్గుముఖం పట్టే ధరలు ఈ విడత డిసెంబరు నెలలోనూ ఆశాజనకంగా ధర ఉండడంతో క్యాబేజీ రైతుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. -పలమనేరు

- నాలుగు నెలలుగా ఆశాజనకంగా ధరలు
- ప్రస్తుతం టన్ను క్యాబేజీ ధర రూ.12 వేలు
- తోటల వద్దకే వచ్చి కొంటున్న వ్యాపారులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



క్యాబేజీని బస్తాలకు నింపుతున్న వ్యాపారులు



రామాపురం వద్ద సాగు చేసిన క్యాబేజీ పంట

పలమనేరు ప్రాంతం శీతల వాతారణాన్ని కలిగి ఉంటుంది. ఇదే వాతారణం పొరుగునే ఉన్న కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లాలోనూ ఉంది. దీంతో అక్కడి రైతులు పండించే పలు కూరగాయల పంటలను ఇక్కడి రైతులు సాగు చేయడం కొన్నేళ్లుగా ఉంది. ఈ నేపథ్యంలో ఇక్కడి రైతులు గత ఖరీఫ్, ప్రస్తుత రబీ సీజన్‌లో 600 హెక్టార్లలో క్యాబేజీని సాగు చేశారు.

**అన్నదాతల ఆసక్తి**

పలమనేరు ప్రాంతంలో ఎర్ర నేలల్లో పంటలు బాగా వస్తుండడంతో రైతులు ఈ పంట సాగుపై ఆసక్తిని చూపుతున్నారు. ఆ మేరకు ఎకరా పొలానికి 20 వేల మొక్కలను సాగు చేశారు. మొక్క రూ.50 పైసల నుంచి రూపాయి దాకా పెట్టి కర్ణాటకలోని నర్సరీల నుంచి తెచ్చారు. దీని పంట కాలం కేవలం 90 రోజులు మాత్రమే. మంచిగా పంట పండితే ఎకరాకు 30 టన్నుల దాకా ఉత్పత్తి ఉంటుంది. ప్రస్తుతం టన్ను క్యాబేజీ ధర రూ. 12 వేలు పలుకుతోంది. ఆ మేరకు 30 టన్నులకు రూ.3.60 లక్షలు వస్తుంది. ఇందులో పంట పెట్టుబడిగా రూ.80 వేలు పోగా ఎకరాకు రూ.2.80 లక్షల దాకా రాబడి వస్తోంది. మరోవైపు ఏటా విజయ దశమి నాటికి వీటి ధరలు అమాంతం తగ్గుముఖం పట్టేవి. కానీ ఈ విడత డిసెంబరు నెలలోనూ ధరలు ఎక్కువగానే ఉండడం విశేషం.

**పొరుగు రాష్ట్రాల నుంచి వ్యాపారులు**

గతంలో క్యాబేజీ సాగు చేసిన రైతులు సరుకు అమ్ముకోలేక చాలా ఇబ్బందులు పడేవారు. కానీ ఇప్పుడు పంట నాణ్యంగా ఉండడం, దానికి తోడు ధరలు ఆశాజనకంగా ఉండడంతో వ్యాపారులు తోటల వద్దే సరుకును కొంటున్నారు. ముఖ్యంగా ఛత్తీస్‌ఘడ్, రాయపూర్, భువనేశ్వర్, కటక్ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కూలీలతో పాటు వచ్చి రైతుల పొలాల వద్దే సరుకును కొంటున్నారు. దీంతో ఈ విడత క్యాబేజీ రైతులకు లాభాల పంట పండింది.

**ఈ ధరలు ఎప్పుడూ లేవు**



నేను క్యాబేజీ పంటను నాలుగేళ్లుగా సాగు చేస్తున్నా. విజయదశమి సీజన్‌కు పంట వచ్చేలా సాగు చేసేవాడిని. ఈ విడత కాస్త లేటుగా పంట వేశా. ఇప్పుడు సైతం ధరలు బాగున్నందున మంచి గిట్టుబాటు కలిగింది. చిన్న కమతాలున్న రైతులకు మూడు నెలల పంట అయిన క్యాబేజీ లాభదాయకంగా మారింది. దానికి తోడు బయటి రాష్ట్రాల వ్యాపారులు తోటల వద్దకొచ్చి సరుకును కొంటున్నారు. దీంతో రవాణా చార్జీలు ఆదా అవుతున్నాయి.
-హరి, రైతు, రామాపురం, పలమనేరు మండలం

### మద్యంషాపు యజమానులకు కోర్టు అక్షింతలు

**పలమనేరు:** పురపాలక సంఘంలో మద్యం షాపులను నిర్వహిస్తూ మున్సిపాలిటీకి ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించకుండా ఎగ్గొట్టిన ఐదుగురు మద్యం షాపు యజమానులకు స్థానిక స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు అక్షింతలు వేసింది. 2012–13లో వీరిపై అప్పటి మున్సిపల్ అధికారులు కేసు వేశారు. పట్టణంలో మద్యం షాపులు నిర్వహిస్తున్న గోవిందు, మునస్వామి, కృష్ణమూర్తి, మునిరత్నం, నారాయణ ట్రేడ్ లైసెన్సు ఫీజులు చెల్లించనందున ఈ వ్యాజ్యం కోర్టు కెళ్లింది. దీనిపై శుక్రవారం స్థానిక స్పెషల్ కోర్టు జడ్జి రాధమ్మ తీర్పు వెలువరించారు. ఈ ఐదుగురు మున్సిపాలిటీకి పన్నులు చెల్లించనందున ఒక్కొక్కరు రూ.63,500 ఈనెల 16లోపు మున్సిపాలిటీకి చెల్లించాలని తీర్పునిచ్చారు. లేకుంటే నెల రోజులు జైలుశిక్ష విధించనున్నట్టు తెలిపారు. ఆ మేరకు ఈ వివరాలను స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి శుక్రవారం మీడియాకు వివరించారు.

### సారా ఊట ధ్వంసం

**పుంగనూరు:** మండలంలోని జువ్వలదిన్నె తండా పరిధిలో నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు చేసి, 1000 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సమాచారం మేరకు నాటు సారా కేంద్రాలపై దాడులు చేసి, సారా ఊటను ధ్వంసం చేసి, ఇందుకు వినియోగించే డ్రమ్ములు, పాత్రలు, ముడిసరుకులు సీజ్ చేశామన్నారు. తయారీదారులపై నిఘా పెట్టామని, త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

### సుబ్రహ్మణ్యస్వామికి వెండిప్రభ సమర్పణ

**పుంగనూరు:** పట్టణంలోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి వెంకట్రామయ్యశెట్టి, భాగ్యలక్ష్మి దంపతులు శుక్రవారం వెండి ప్రభను సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. సుబ్రహ్మణ్యస్వామికి వెండిప్రభను బహూకరించిన వెంకట్రామయ్యశెట్టి దంపతులను అభినందించారు. స్వామివారికి వెండి ప్రభను అమర్చి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

## రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి

**వి.కోట:** రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండలంలోని గోనుమాకులపల్లి పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పలమనేరు ఆర్డీఓతో కలసి హాజరయ్యారు. అర్జీలు స్థానిక తహసీల్దార్ ఆధ్వర్యంలో పరిష్కరించబడుతాయన్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డి పల్లి శ్మశాన వాటిక భూమి ఆక్రమణపై ఫిర్యాదు, అదే విధంగా ఎస్టీల భూసమస్యలపై వినతులు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్వతి, మండల అధికారులు పాల్గొన్నారు.

**బైరెడ్డిపల్లి:** రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎస్.అమరనాథ రెడ్డి పిలుపునిచ్చారు. బైరెడ్డిపల్లె మండలంలోని బేలుపల్లెలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఆయనతో పాటు ఆర్డీఓ భవాని, తహశీల్దార్ మాధవరాజు, వీఆర్ ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**పులిచెర్ల(కల్లూరు):** గ్రామాల్లో నెలకొన్న భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు జయసింహా తెలిపారు. శుక్రవారం మండలంలోని కల్లూరు1, 2 సచివాలయ పరిధిలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించి పరిష్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్

**సదుం:** మండలంలోని 79 ఏ చింతమాకుల పల్లెలో రెవెన్యూ సదస్సులను శుక్రవారం ప్రారంభించారు. వివిధ సమస్యలపై 16 ఫిర్యాదులు అందినట్లు తహశీల్దార్ మారుఫ్ హుస్సేన్ , డీటీ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

**గుడుపల్లె:** రెవెన్యూ సదస్సులో భూములకు సంబంధించిన హక్కులను పొందాలని తహసీల్దార్ సీతారాం పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 20 అర్జీలు వచ్చాయి. వీటిని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారానిక ఎలాంటి రుసుం లేకుండా మ్యుటేషన్‌లో రెవెన్యూ రికార్డులను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబునాయుడు, హేమాంబరగౌడు పాల్గొన్నారు.

## వెలవెలబోయిన సదస్సులు

**పలమనేరు:** భూముల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం మొదలైన రెవెన్యూ సదస్సులు అర్జీదారులు రాక వెలవెలబోయాయి. జగమర్ల గ్రామంలో తొలి సదస్సు శుక్రవారం జరిగింది. ఈ గ్రామంలో 720 మంది జనాభా, 520 ఓటర్లున్నారు. సదస్సుకు తహసీల్దార్ ఉన్నునాథన్, ఎంపీడీవో ఖాదర్‌బాషా మినహా మిగిలిన శాఖల అధికారులు హాజరు కాలేదు. ఇలా ఉండగా ఇక్కడ ఆర్‌బీకేకు దారిసమస్య, గ్రామ సమీపంలోని ఆలయ సమస్యతో పాటు పది దాకా వ్యక్తిగత సమస్యలపై అర్జీలు మాత్రమే వచ్చాయి. సాయంత్రం దాకా అధికారులు వేచి చూసినా ప్రజల నుంచి స్పందన కనిపించలేదు. దీంతో సభ మధ్యలోనే ఎంపీపీ రోజా, స్థానిక సర్పంచ్ విజయ్‌కుమార్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సైతం ఆర్‌డీవో భవాని, తహసీల్దార్లకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తాతముత్తాల కాలం నాటి తమ పొలానికే 1బని మార్చేసిన ఘనత రెవెన్యూ అధికారులదని , ఎమ్మెల్యేగా తనకే ఇలాంటి సమస్య వస్తే ఇక సామాన్య ప్రజలు రెవెన్యూ వారి నుంచి మరెన్ని సమస్యలు పడుతున్నారో తనకు తెలుసునని ఆయన ఆవేదన వ్యక్తం చేయడం కొసమెరుపు.



జగమర్లలో జనం లేని గ్రామసభ

## సమస్యల పరిష్కారంలో తగ్గేదేలే : ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

**పుంగనూరు:** ప్రజల సమస్యలను పరిష్కరించడంలో వెనుకంజ వేసే ప్రసక్తే లేదని, అహర్నిశలు ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీ రెడ్డెప్పతో కలసి పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సర్కిల్, ఎంపీడీవో కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి, వాటిని పరిష్కరించాలని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషాను కోరారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటూ వారి కష్టసుఖాల్లో ఎల్లప్పుడు భాగస్వాములవుతామన్నారు. తమ కుటుంబానికి వెన్నంటి ఉన్న ప్రజలను విస్మరించే ప్రసక్తే లేదని , ఎన్ని కష్టాలు ఎదురైన ప్రజలకు అండగా ఉంటామన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉన్న సమస్యలను గుర్తించి నివేదికలు తయారు చేస్తున్నారని, వాటిని విడతల వారీగా పరిష్కరిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు తమ సమస్యలను ఎప్పటికప్పుడు తెలియజేసి, ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని పెద్దిరెడ్డి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిదులు, పెద్దిరెడ్డి అభిమానులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన నేతలు**

**గంగవరం:** పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పలమనేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి నుంచి పుంగనూరు పర్యటనకు వెళ్తున్న పెద్దిరెడ్డికి గంగవరం ఫ్లైఓవర్ వద్ద నియోజకవర్గ పార్టీ శ్రేణులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. డ్రైవర్స్ కాలనీకి సమీప మైదానంలో జరిగే ఇస్తిమాకు రావాలంటూ ముస్లిం మైనారిటీ సభ్యులు పెద్దిరెడ్డిని ఆహ్వానించారు. ఆ తరువాత అక్కడి నుంచి పుంగనూరు పర్యటనకు బయలుదేరి వెళ్లారు. పెద్దిరెడ్డిని కలిసిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, మురళి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఏరియా ఆసుపత్రి కమిటీ మాజీ చైర్మన్ చెంగారెడ్డి, పట్టణ మాజీ కన్వీనర్ సుధ, గంగవరం మండల జెడ్పీటీసీ పార్వతి, పార్టీ నేతలు చంద్రప్ప, లక్కనపల్లి శ్రీనివాసులురెడ్డి, గిరిరాజారెడ్డి, రహీంఖాన్, కౌన్సిలర్లు ఉన్నారు.

### టీచర్‌పై దాడి హేయం



ఎంఈఓకు వినతిపత్రాన్ని ఇస్తున్న సంఘం నేతలు

**పలమనేరు:** రాయచోటి జిల్లా కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల దాడిలో గాయపడి మృతి చెందిన ఇజాజ్ అహ్మద్ కుటుంబానికి స్థానిక ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య సంతాపం తెలిపింది. ఇందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఓ వినతి పత్రాన్ని స్థానిక ఎంఈవో లీలారాణికి వినతి పత్రాన్ని అందజేశారు.

## కనుల పండువగా కోనేటిరాయుని కల్యాణం

**గంగవరం:** మండలంలోని కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో శుక్రవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కోనేటిరాయస్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక కల్యాణ వేదికపై కొలువుదీర్చి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాంగళ్యధారణ గావించారు. కల్యాణోత్సవం అనంతరం ఉత్సవర్లపై తలంబ్రా లు కురిపించి మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు సంప్రదాయ దుస్తులతో స్వామివారి కల్యాణోత్సవాన్ని వీక్షించి తరించారు.



శ్రీ కోనేటిరాయుని కల్యాణంలో అర్చకులు

అనంతరం గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, అర్చకులు దేవరాజాచార్యులు, శ్రీహర్ష దీక్షితులు, భక్తులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ బాటలో పయనిద్దాం

**పలమనేరు:** డా.బి.ఆర్. అంబేడ్కర్ వర్ధంతిని స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, దళిత సంఘాలు శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. పలమనేరులోని అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు, పార్టీ శ్రేణులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితులు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన అంబేడ్కర్ ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. మరోవైపు పట్టణానికి చెందిన ఎస్సీ ఉద్యోగ సంఘం నాయకులు పుష్పరాజ్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. పట్టణంలోని సీపీఎం నేతలు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ వెంకటేశు ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమాల్లో పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధా, మాజీ ఏఎంసీ చైర్మన్ ప్రహ్లాద, బైరెడ్డిపల్లి జెడ్పీటీసీ కేశవులు, కౌన్సిలర్లు శ్యామ్ సుందర్‌రాజు, సల్మా శ్యామ్, రఘునాథ్, పవన్, నరేష్, సుందరేష్, రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.





పలమనేరు: అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్

**ఆశయ సాధనకు కృషి**

**పెద్దపంజాణి:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప, ఎంపీడీఓ బాలాజీ ఘనంగా నివాళులర్పించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి మాల మహానాడు మండల శాఖ అధ్యక్షుడు మంజునాథ్ కుల సంఘాల నాయకులతో కలసి నివాళులర్పించారు. ఏఓ భాస్కర్, కార్యాలయ సిబ్బంది రాజశేఖర్, నాగరాజ, గజేంద్ర, ఏపీఓ మురుగేషన్, మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

**రొంపిచెర్ల:** రొంపిచెర్ల ఆర్టీసీ బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, విద్యావేత్త రఘునాథ్, నారాయణస్వామి, గిరిబాబు, నరేష్, ఓబులేసు, చంద్రశేఖర్ అచ్చారి, సైపూల్లాఖాన్, ముజీబ్‌బాషా, బాలాజీ, శశికుమార్, రాజన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

**సదుం:** అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. నాయకులు వెంకటస్వామి, సర్పంచ్ ఉషారాణి, సీతాపతి, శ్రీనివాసులు, రామచంద్రయ్య, ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, ఇమ్రాన్, శివారెడ్డి పాల్గొన్నారు.

**రామకుప్పం:** డా.బీ.ఆర్ అంబేడ్కర్ అందరికీ ఆదర్శనీయమని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం రామకుప్పంలోని సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నేతలు, దళిత సంఘాల నేతలు నివాళులర్పించారు. అనంతరం టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత సంఘాల నేతలు వెంకటేశు మాదిగ, రామకృష్ణ, సుగుణప్ప, నారాయణస్వామి, రఘు, గోవిందప్ప, నేతలు చంద్రారెడ్డి, ఆనందరెడ్డి, వెంకటరమణ, రాజసింహ, బెల్లాల నాగరాజు, యశ్వంత్, ప్రసాద్ పాల్గొన్నారు.



కుప్పం: అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు

**వి.కోట:** మండల కేంద్రంలో అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం ఎంపీపీ యువరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీలు లక్ష్మణ్ రెడ్డి, తమీమ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పీఎస్ హరి, బాబు పాల్గొన్నారు.



రామకుప్పం: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



సదుం: నివాళులర్పిస్తున్న పెద్దిరెడ్డి, నేతలు

**కుప్పం:** డా. బిఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా కుప్పం మున్సిపాలిటీ కౌన్సిలర్లు ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, రంగన్న, మోహన్ రామ్, సయ్యాద్ ఆలీ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

**శాంతిపురం:** అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండల సచివాలయం వద్ద నివాళి అర్పించారు. ఎంపీడీఓ కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. దళిత సంఘాల నాయకులు దేవరాజులుమాదిగ, బాలకృష్ణ పాల్గొన్నారు.